చంద్రబాబుకు మతిస్థిమితం తప్పింది

- నిరాధార ఆరోపణలు చేయడం తగదు
- 14 యేళ్లు సీఎంగా ఉండి ప్రజలకు చేసిందేమిటి?
- గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే సాయి





సంక్షేమ పథకాల గురించి మహిళలకు వివరిస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

ఆదోనిరూరల్: మాజీ సీఎం చంద్రబాబుకు మతిస్థిమితం తప్పిందని, తాను, తన కుమారుడిపై నిరాధారణమైన ఆరోపణలు చేస్తున్నారని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి మండిపడ్డారు. 14 యేళ్లు సీఎంగా ఉండి ప్రజలకు ఏమి చేశారని ప్రశ్నించారు. జన్మభూమి కమిటీల పేరుతో పార్టీ కార్యకర్తలకు స్వలాభం చేకూర్చారని ఆరోపించారు. వైఎస్ కుటుంబం లాగా చిరస్థాయిగా నిలిచిపోయే ఒక్క పథకం, కార్యక్రమం చేపట్టకపోవడం దౌర్భాగ్యమన్నారు. సోమవారం ఆదోని పట్టణంలోని 24వ వార్డు కల్లుబావి, శంకర్‌నగర్ ప్రాంతాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి గడపకు తిరుగుతూ సమస్యలను తెలుసుకుని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాసంకల్ప పాదయాత్రలో ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం నవరత్నాలు ద్వారా అన్ని రకాల సంక్షేమ పథకాలను అర్హులకు మాత్రమే అందజేసి పేదవాడిని లక్షాధికారిగా చేశారని కొనియాడారు. గత ప్రభుత్వాల కన్నా తక్కువ బడ్జెట్‌లో రాష్ట్రంలో ఇన్ని సంక్షేమ పథకాలు ప్రజలకు అందజేస్తుంటే చంద్రబాబునాయుడికి మింగుడుపడడం లేదన్నారు. ఆయన హయాంలో అంతా దోచుకోవడం దాచుకోవడం జరిగిందన్నారు. మంచి చేస్తున్న జగనన్నకు ఓటు వేసి మరోసారి సీఎంగా గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు బి.దేవా, మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత, వార్డు ఇన్‌చార్జ్ మాధవరెడ్డి, వీరభద్రరెడ్డి, రవిరెడ్డి, స్టేట్ డైరెక్టర్ రేణుక, మంజుల, భాను, కౌన్సిలర్లు రాజేశ్వర్‌రెడ్డి, చంద్రశేఖర్‌స్వామి, మల్లి, శ్రీలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి, నల్లారెడ్డి, చంద్రకాంత్ రెడ్డి, వైస్ చైర్మన్ నరసింహులు, ఎంఎంజీ గౌస్, సర్దార్ నాగరాజు, సాయన్న, నాగేంద్ర, ముని, షేక్షావలి, సుగుణమ్మ, గిరి, రవిరెడ్డి, ఎర్రిస్వామి, మస్తాన్, బాపురెడ్డి పాల్గొన్నారు.

ఆదోని సెంట్రల్: బడుగు, బలహీన వర్గాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం తన స్వగృహంలో 8వ వార్డు కాలనీకి చెందిన 160 మందికి ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు.

స్కౌట్స్ విద్యార్థినులకు అభినందన

కోసిగి: ఈ నెల 26న రిపబ్లిక్ డే వేడుకల్లో పరేడ్ నిర్వహించిన స్థానిక మోడల్ స్కూల్ 9వ తరగతి విద్యార్థినులు శ్రీ హారిక, అమృత వర్షిణి, నరసమ్మలను సోమవారం ప్రిన్సిపాల్ సమీరా రెడ్డి, అధ్యాపక బృందం ప్రత్యేకంగా అభినందించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో జరిగిన రిపబ్లిక్ డే వేడుకల్లో తమ పాఠశాల నుంచి స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థినులు జిల్లా కలెక్టర్ డాక్టర్ సృజన, డీఈఓ రంగారెడ్డి, జనరల్ సెక్రటరీ శ్యాముల్ పాల్, ఆదామ్ బాషా, శ్రీనివాసులు సమక్షంలో కవాతు చేపట్టడంపై హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థినులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థినులు పాఠశాలలో కవాతు నిర్వహించి తోటి విద్యార్థినులకు స్ఫూర్తిగా నిలిచారు.



మోడల్ స్కూల్ స్కౌట్స్ అండ్ గైడ్స్ బృందాన్ని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సమీరా రెడ్డి

క్లుప్తంగా

వాహనదారులకు కంటి పరీక్షలు



డ్రైవర్‌కు కంటి పరీక్షలు చేయిస్తున్న ఎంవీఐ అధికారులు

ఆదోనిఅర్బన్: జాతీయ భద్రతా మాసోత్సవాల్లో భాగంగా వాహనదారులకు స్థానిక కార్యాలయంలో ఎంవీఐ సిసిరాదీప్తి, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ తమ కుటుంబాలను దృష్టిలో పెట్టుకొని వాహనాలను నడపాలని సూచించారు. మానవ తప్పిదాలతోనే రోడ్డు ప్రమాదాలు జరుగుతాయని, తమ వంతుగా నియమ, నిబంధనలు పాటిస్తే ప్రమాదాలను అరికట్టవచ్చన్నారు. మద్యం సేవించి, సీటుబెల్టు పెట్టుకోకుండా, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ నడపడం, అతివేగంగా వెళ్లడం ప్రమాదాకరమన్నారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు ఎంపిక



స్కాలర్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థులతో అధ్యాపక బృందం

కోసిగి: స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో 8వ తరగతి విద్యార్థులు నలుగురు నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్ (ఎన్‌ఎంఎంఎస్)కు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సమీరా రెడ్డి తెలిపారు. సోమవారం ఆ విద్యార్థులను అధ్యాపక బృందంతో కలిసి అభినందించారు. విద్యార్థులు ఎస్.తిమ్మరాజు, కె.వీరేంద్రకుమార్, ఎం.ఆనంద్, ఎ.సాయి విద్యశ్రీ ప్రతిభ చాటి స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్లు చెప్పారు. వారికి 9వ తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు నెలకు రూ.1000 చొప్పున నాలుగేళ్ల పాటు కేంద్ర ప్రభుత్వం స్కాలర్‌షిప్ మంజూరు చేస్తుందని తెలిపారు. ఈ మొత్తాన్ని ఉన్నత చదువులకు ఉపయోగించుకోవాలని సూచించారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన అధ్యాపకులు లక్ష్మీణి, ప్రవీనా, సురేంద్ర కుమార్ తదితరులను అభినందించారు.

ఆటో బోల్తా.. వ్యక్తి మృతి



మృతుడు పెద్ద నరసప్ప (ఫైల్)

ఆదోనిఅర్బన్: మండలంలోని గోనబావి గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ పెద్ద నరసప్ప (55) ఆస్పరి రోడ్డులో సోమవారం ఆటో బోల్తా పడిన ఘటనలో మృతిచెందాడు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్న పెద్ద నరసప్ప ఆదోని నుంచి స్వగ్రామానికి వస్తుండగా ఆస్పరి రోడ్డులోని బాట మారెమ్మవ్వగుడి సమీపంలో ప్రమాదవశాత్తు ఆటో బోల్తా పడింది. తీవ్ర గాయాలవడంతో స్థానికులు వెంటనే ఆదోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం వైద్యులు కర్నూలుకు రెఫర్ చేశారు. కర్నూలు ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తాలూకా పోలీసులు చెప్పారు. మృతుడికి భార్య లక్ష్మి, ఇద్దరు కుమారులు ఉన్నారు.

జంతువులను సంరక్షించాలి

ఆదోనిసెంట్రల్: యజమానులు పెంపుడు జంతువుల సంరక్షణకు కృషి చేయాలని డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ పి.వి.రమణ సూచించారు. సోమవారం స్థానిక పశువైద్యశాలలో జంతు సంరక్షణ పక్షోత్సవాలను నిర్వహించారు. కుక్కల యజమానులు ఆస్పత్రికి తీసుకొచ్చి రేబిస్ ఇంజెక్షన్లు వేయించారు. ఈ సందర్భంగా వారికి ఆయన పలు సూచనలు తెలియజేశారు. పెంపుడు జంతువులకు ఎప్పటికప్పుడు సీజనల్ టీకాలు వేయించాలని చెప్పారు.

వైఎస్సార్‌సీపీతోనే ప్రజా సంక్షేమం

ఆలూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలను అందించారని వైఎస్సార్‌సీపీ జిల్లా కోశాధికారి కొత్త కాపుమధుసూదన్ రెడ్డి పేర్కొన్నారు. ఆయన సోమవారం హోలహర్వి మండలం గూళ్యం, బాపురం, పచ్చార్లపల్లి, హోలహర్వి, ఆలూరు గ్రామాల్లో పర్యటించి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆలూరులో మాట్లాడుతూ.. నవరత్నాల పథకాల ద్వారా పేదలందరికీ లబ్ధి చేకూరిందని వివరించారు. సంక్షేమ పథకాలు అభివృద్ధి కొనసాగాలంటే రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి అఖండ విజయం అందించాలని పిలుపునిచ్చారు. ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాసులు తదితరులు వెంట ఉన్నారు.

నేటి నుంచి సుంకులమ్మ దేవర



మద్దికెర: మండల పరిధిలోని బొమ్మనపల్లి గ్రామంలో సుంకులమ్మ దేవి గ్రామ దేవర రెండు రోజుల పాటు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు గ్రామ ప్రజలు తెలిపారు. మంగళవారం ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు సాయంత్రం దున్నపోతు ఊరేగింపు తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు. 31వ తేదీ బుధవారం ఇంటింటి నుంచి బోనాలతో ఊరేగింపు నిర్వహించి ఆలయ ప్రదక్షిణల అనంతరం అమ్మవారికి పూజలు చేయడం జరుగుతుందన్నారు.

చంద్రబాబుకు మతి భ్రమించింది

ఆదోనిఅర్బన్: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి మతి భ్రమించిందని, అందుకే పసలేని ఆరోపణలు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ కర్నూలు జిల్లా కార్యదర్శి వెల్లాల మధుసూదనశర్మ విమర్శించారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయం వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆదివారం పత్తికొండలో టీడీపీ నిర్వహించిన కదలి రా కార్యక్రమానికి ప్రజల నుంచి స్పందన కొరవడటంతో ఏమి చేయాలో దిక్కుతోచక ఆదోని ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి, ఆయన తనయుడు జయమనోజ్ రెడ్డిపై ఆరోపణలు చేశారన్నారు. ఆయన పరిస్థితి చూస్తుంటే జాలేస్తుందన్నారు. పార్టీలో ఎవరికి టికెట్ ఇవ్వాలో తెలియక, పోటీ చేయడానికి ఎవరూ సుముఖంగా లేకపోవడంతో ఇలాంటి పసలేని ఆరోపణలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. ఎలాగైనా వారి ప్రజాబలాన్ని తగ్గించాలని కుట్రతోనే ఇలాంటి చర్యలకు పాల్పడతున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రతిపక్ష హోదా కూడా దక్కదని స్పష్టం చేశారు.

వందలీటర్ల నాటుసారా స్వాధీనం



నాటుసారాను చూపుతున్న తాలూకా పోలీసులు

ఆదోనిరూరల్: పత్తికొండ మండలం జె.ఎం.తండా నుంచి వంద లీటర్ల నాటుసారాను తరలిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు తాలూకా సీఐ నిరంజన్‌రెడ్డి సోమవారం తెలిపారు. పుల్లయ్యనాయక్, గోపాల్ నాయక్ బైకుపై నాటుసారా తరలిస్తున్నారనే సమాచారం మేరకు ఆదోని పట్టణ శివారులోని వైపీఆర్ కాలనీ వద్ద అదుపులోకి తీసుకొని వంద లీటర్ల నాటుసారా, బైకును స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. అయితే పుల్లయ్యనాయక్ పట్టుబడగా, గోపాల్‌నాయక్ పరారయ్యాడన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. దాడుల్లో ఎస్ఐ ఎర్రిస్వామి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం విక్రేత అరెస్ట్

మండలంలోని మదిరె గ్రామానికి చెందిన వీరేష్ అక్రమంగా కర్ణాటక మద్యం అమ్ముతుండగా అరెస్టు చేసినట్లు ఇస్పీ ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. ఆయన నుంచి 90 ఎం.ఎల్. పరిమాణం గల 30 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని, రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

వడ్డెరలను ఎస్టీలుగా గుర్తించాలి



మంత్రాలయంలో నినాదాలు చేస్తున్న వడ్డెర్ల సంఘం నాయకులు

మంత్రాలయం: రాష్ట్ర ప్రభుత్వం వడ్డెరలను ఎస్టీలుగా గుర్తించాలని ఆ సంఘం నాయకులు కౌతాళం రాము, వడ్డె నారాయణ కోరారు. మంత్రాలయంకు చెందిన స్వాతంత్ర్య సమర యోధుడు వడ్డె ఓబన్న జయంతిని సోమవారం ఆ సేవా సమితి ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ముందుగా మంత్రాలయంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి ర్యాలీగా వెళ్లి వడ్డె ఓబన్న చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాఘవేంద్ర సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. బ్రిటీష్ సామ్రాజ్యంపై పోరాటంలో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి సర్వసైన్యాధ్యక్షుడిగా వడ్డె ఓబన్న పోరాటం చేశాడని కొనియాడారు. వడ్డెరలు ఆయన్ను స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం వడ్డెరలను ఎస్టీలుగా గుర్తించి వారి అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఆ సంఘం నాయకులు కృష్ణమూర్తి, నాగరాజు, బాలరాజు, చిన్న ఈరన్న, నరసింహా, వెంకట్రాజు, వీరేష్, రామకృష్ణ, రాకేష్, శివరాజ్ తదితరులు ఉన్నారు.

ఆంగ్ల బోధన సమర్థవంతంగా నిర్వహించాలి



కస్తూర్బా గాంధీ పాఠశాలలో భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ నాగేశప్ప

కోసిగి: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు విద్యార్థులకు ఆంగ్ల బోధనను సమర్థవంతంగా నిర్వహించేలా చూడాలని ఎంఈఓ నాగేశప్ప ఉపాధ్యాయులకు సూచించారు. సోమవారం కోసిగిలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..విద్యార్థినులు ఇంగ్లిష్ మీడియంపై పట్టు సాధించేలా ఉపాధ్యాయులు బోధన సాగించాలన్నారు. వెనకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక క్లాస్‌లు తీసుకుని వారికి అర్థమయ్యేలా బోధించాలన్నారు. ఈ ఏడాది 10వ తరగతిలో మంచి మార్కులు సాధించేలా కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థుల కోసం సిద్ధం చేసిన భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని వంట ఏజెన్సీ వారికి సూచించారు. ఉపాధ్యాయులు ఉన్నారు.

సహకార సొసైటీలతో రైతులకు సేవలు



సొసైటీ భవనాన్ని ప్రారంభిస్తున్న కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ విజయ మనోహరి, సొసైటీ చైర్మన్ మల్లికార్జున

హొళగుంద: ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల (పీఏసీఎస్) ద్వారా రైతులకు రుణాలు, ఇతర మెరుగైన సేవలు అందుతున్నాయని కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ విజయ మనోహరి అన్నారు. సోమవారం సింగిల్ విండో చైర్మన్ వందవాగిలి మల్లికార్జున అధ్వర్యంలో హొళగుంద సమీపంలోని శ్రీరాంనగర్ క్యాంపులో అప్కాబ్ రుణ సాయంతో పాటు సొసైటీ భాగస్వామ్యంతో నిర్మించిన పీఏసీఎస్ నూతన కార్యాలయ భవనాన్ని ఆమె ప్రారంభించారు. అలాగే స్ట్రాంగ్‌రూంతో పాటు బస్టాండు సమీపంలోని సుఖవాయి రోడ్డులో ఏర్పాటు చేసిన జన ఔషధి దుకాణాన్ని ప్రారంభించారు. అంతకుముందు సొసైటీ భవనం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. హొళగుంద సొసైటీని అభివృద్ధి చేస్తూ రైతులకు అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తున్న సొసైటీ చైర్మన్ వందవాగిలి మల్లికార్జున, సీఈఓ నీలకంఠ స్వామి, సిబ్బందిని అభినందించారు. సొసైటీలో గోల్డ్ లోన్‌లు ఇచ్చేందుకు చర్యలు చేపట్టామని, అలాగే రైతులు పండించిన దిగుబడులను నిల్వ చేసేందుకు గోడౌన్ ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. అలాగే నాణ్యమైన జనరిక్ ఔషధాలను సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జన ఔషధి దుకాణంలో తక్కువ ధరకే పొందవచ్చన్నారు. సింగిల్ విండో చైర్మన్ వందవాగిలి మల్లికార్జున, సెక్రటరి నీలకంఠయ్య స్వామి (సీఈఓ), జెడ్పీ వైస్ చైర్మన్ కురువ బుజ్జమ్మ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ షఫీవుల్లా, ఈశా, కోగిలతోట శేషప్ప, పంపాపతి, ఎంపీటీసీ మల్లికార్జున, హనుమప్ప, ఎస్కే గిరి తదితరులతో పాటు కేడీసీసీ డీసీఓ, సీఈఓలు రామాంజనేయులు, అప్కాబ్ ఏజీఎం సాహిదా సుల్తాన్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లార్తి దర్గాలను దర్శించుకున్న కేడీసీసీబీ చైర్‌పర్సన్

హొళగుంద: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఎల్లార్తి షేక్షావలి, షాషావలి దర్గాలను సోమవారం కేడీసీసీ బ్యాంక్ చైర్‌పర్సన్ విజయ మనోహరి దర్శించుకున్నారు. దర్గా నిర్వాహకులు ఆమెకు స్వాగతం పలికి ప్రత్యేక ఫాతెహాలు నిర్వహించారు. వస్త్రాలు, ప్రసాదాలను అందజేయగా ఆమె కొద్దిసేపు దర్గాలోనే గడిపారు. అనంతరం దర్గా సిబ్బంది శాలువా కప్పి సన్మానించారు.

స్పందన అర్జీలను గడువులోపు పరిష్కరించాలి



స్పందన కార్యక్రమంలో ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ

ఆదోనిరూరల్: స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన అర్జీలకు గడువులోపు పరిష్కారం చూపి, అర్జీదారులను సంతృప్తి పరిచేలా చూడాలని ఆదోని సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ సూచించారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో స్పందనలో పాల్గొని డివిజన్‌లోని ఆయా మండలాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ ఎట్టి పరిస్థితుల్లోనూ బియాండ్ ఎస్ఎల్ఏలోకి వెళ్లకుండా చూడాలని చెప్పారు. కార్యక్రమంలో పరిపాలనాధికారి గోవింద్‌సింగ్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణుసూర్య, శ్రీనివాసులు, డీఎల్‌డీఓ నాగేశ్వరరావు, డీఎల్‌పీఓ కార్యాలయపు పరిపాలనాధికారి వీరభద్రప్ప, గృహనిర్మాణ శాఖ డిప్యూటీ ఇంజినీర్ రవికుమార్, ఆర్అండ్‌బీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కృష్ణారెడ్డి, ఆర్డీ నాగేంద్ర, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చేతన్‌ప్రియ, ఉప తహసీల్దార్ కౌసర్‌బాను, పెద్దయ్య పాల్గొన్నారు.

సమస్యల్లో కొన్ని..

- గోనెగండ్ల మండలానికి చెందిన రాజేష్ సర్వే నంబర్ 491లో 3.23 ఎకరాల భూమి ఉంది. కొద్ది రోజుల నుంచి ఆ భూమి ఆన్‌లైన్‌లో వేరే వారి పేరు నమోదైందని, విచారణ చేసి తన పేరును ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అర్జీ సమర్పించారు.
- తనకు ఇంటి స్థలం, వితంతు పింఛన్ అందజేయాలని ఆదోని పట్టణం అంబేడ్కర్ నగర్‌కి చెందిన వెంకటలక్ష్మి అర్జీ అందజేసింది.
- గోనెగండ్ల మండల కేంద్రానికి చెందిన కటికె అక్బర్‌బీ తన భర్త హుసేన్‌సాబ్ 2009 మే 2న మరణించారు. తమకు అవగాహన లేనందు వల్ల మరణ ధ్రువ పత్రం తీసుకోలేదు. దయచేసి విచారణ చేసి నా భర్త మరణ ధ్రువ పత్రం మంజూరు చేయాలని వినతి పత్రంలో పేర్కొన్నారు.
- ఆదోని పట్టణం ఎస్‌కేడీ కాలనీకి చెందిన రాజశెట్టికి సర్వే నంబర్ 7సీ/ఏ3లో 2 ఎకరాల భూమి కొనుగోలు ద్వారా సంక్రమించిందని, ప్రస్తుతం అందులో 1.50 ఎకరాలు విక్రయించామని, మిగిలిన 0.50 సెంట్లకు భూమి పట్టాదారు పాసు పుస్తకం మంజూరు చేయాలని అర్జీ సమర్పించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

కోసిగి: మండల పరిధిలోని చిర్తనకల్లు గ్రామానికి చెందిన ఎద్దులింటి హనుమంతు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. సోమవారం వివిధ పనుల నిమిత్తం కోసిగికి వచ్చి పనులు ముగించుకుని తిరిగి బైక్‌పై స్వగ్రామానికి బయలుదేరాడు. చిర్తనకల్లు సమీపంలో వెళుతుండగా బైక్ అదుపుతప్పి కింద పడిపోయాడు. తలకు తీవ్ర గాయం కావడంతో సొమ్మసిల్లి పడిపోయాడు. ఆ మార్గంలో వెళ్లిన వారు గుర్తించి బైక్‌పై కోసిగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్య సేవలు అందించారు. బాధితుడు కోలుకుంటున్నట్లు వారు తెలిపారు.

వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలి

పెద్దకడబూరు: స్థానిక బీసీ హాస్టల్‌లో విద్యార్థుల సమస్యలను పట్టించుకోని వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలని మెనూ పాటించని వంట ఏజెన్సీని తొలగించాలని ఏఐఎస్ఎఫ్ డివిజన్ అధ్యక్షుడు ఈరేష్, నాయకులు భాస్కర్, రవి రెడ్డి డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం హాస్టల్‌ను సందర్శించి విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. విద్యార్థులు కనీస సౌకర్యాలకు నోచుకోవడం లేదన్నారు. గదులలో ఫ్యాన్లు లేక రాత్రిపూట దోమల బెడదతో విషజ్వరాల భారిన పడినా వార్డెన్ పట్టించుకోవడం లేదన్నారు. వార్డెన్ సమయపాలన పాటించకపోవడంతో వంట ఏజెన్సీ వారు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. మెనూ పాటించకుండా రోజూ అన్నం, పప్పు, మజ్జిగతోనే సరిపెడుతున్నారన్నారు. సంబంధిత అధికారులు హాస్టల్‌లో నెలకొన్న సమస్యలను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చురుగ్గా కులగణన సర్వే

ఆలూరు రూరల్: మండలంలోని 17 గ్రామ సచివాలయాల పరిధిలో కులగణన సర్వే చురుగ్గా సాగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సర్వేలో భాగంగా సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి కుటుంబసభ్యుల వివరాలు నమోదు చేస్తున్నారు. సోమవారం నాటికి 78 శాతం సర్వే పూర్తయినట్లు అధికారులు వెల్లడించారు. మండలంలో మొత్తం 10,558 కుటుంబాలు 56,238 మంది జనాభా ఉన్నారు. కులగణన ద్వారా ప్రజల జీవన విధానం, ఆర్థిక, సామాజిక స్థితిగతులు తెలుస్తాయని అధికారులు తెలిపారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

ఆదోనిరూరల్: ఉపాధి హామీ వేతనాలు 16 వారాలుగా పెండింగ్‌లో ఉన్నాయని, వెంటనే చెల్లించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం ఉపాధి హామీ ఏపీఓ చంద్రశేఖర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కె.లింగన్న మాట్లాడుతూ 16 వారాలుగా ఉపాధి హామీ వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. కరువు మండలంగా ప్రకటించిన ఉపాధి హామీ పనిదినాలు 50 రోజులు అదనంగా రావాల్సి ఉన్నా రాలేదన్నారు. ఏపీఓ మాట్లాడుతూ ఫిబ్రవరి మొదటి వారంలో వేతనాలు కూలీల ఖాతాల్లో జమ చేస్తామని చెప్పారు. మండలాధ్యక్షుడు జి.రంగనాథ్, మండల కమిటీ సభ్యులు అబ్దుల్ రహమాన్, రామప్ప, జి.కర్ణ, జి.నరసింహులు, ఉపాధి హామీ మేటీలు శంకరప్ప, చిన్నమూకప్ప పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోండి

చిప్పగిరి: కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కొండయ్య ప్రజలకు సూచించారు. సోమవారం మండలంలోని నంచర్ల గ్రామంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా వైద్య శిబిరం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



స్పందనలో ఫిర్యాదు చేస్తున్న సీపీఐ నాయకులు

కోసిగి: మండల పరిధిలోని చిర్తనకల్లు గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఐ మండల కార్యదర్శి గోపాల్, సహాయ కార్యదర్శి ఓంకార్ స్వామి కోరారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో గ్రామ సమస్యలపై తహసీల్దార్ రుద్రగౌడకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ గ్రామంలో ఎస్సీ కాలనీలో విద్యుత్ స్తంభాలు పెచ్చులూడి ప్రమాదకరంగా మారాయన్నారు. స్తంభాలు ముట్టుకుంటే విద్యుత్ షాక్ కొడుతోందని ఆరోపించారు. వాటిని తొలగించి కొత్త స్తంభాలు ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరించాలన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో డీహెచ్‌పీఎస్ మండలాధ్యక్షుడు తిక్కయ్య, రాజు, గ్రామస్తులు ఉన్నారు.

ఉరుకుందలో భక్తుల సందడి



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు



ప్రత్యేక అలంకరణలో ఈరన్న స్వామి

కౌతాళం: ప్రముఖ పుణ్యక్షేత్రం ఉరుకుంద ఈరన్న స్వామి క్షేత్రంలో భక్తుల సందడి నెలకొంది. సోమవారం ప్రత్యేక దినం కావడంతో భక్తులు వేలాదిగా తరలివచ్చి స్వామి సేవలో తరించారు. స్వామి వారి దర్శనానికి గంట సమయం పట్టింది. భక్తుల రాకతో దర్శన క్యూలైన్లు, వ్యాపార దుకాణాల వద్ద రద్దీ నెలకొంది. ముందుగా స్వామికి పూలమాలలు, అర్చనలు చేసి నారికేళాలు సమర్పించారు. మరికొందరు భక్తులు మొక్కుబడిలో భాగంగా తలనీలాలు ఇచ్చుకుని నైవేద్యాలు సమర్పించి పూజలు చేశారు.

క్రీడా మైదానాలు కళకళ



బాలికల హైస్కూల్ మైదానంలో తలపడుతున్న కబడ్డీ క్రీడాకారులు

ఎమ్మిగనూరుటౌన్: శ్రీ నీలకంఠేశ్వర స్వామి జాతర మహోత్సవం సందర్భంగా ఎమ్మిగనూరు పట్టణంలో రాష్ట్ర స్థాయిలో పలు క్రీడాపోటీలు నిర్వహిస్తున్నారు. వైఎస్సార్ అంతర్రాష్ట్ర స్థాయి వృషభాల బండలాగుడు పోటీలు, ఫుట్‌బాల్, వాలీబాల్, షటిల్, పురుష కబడ్డీ పోటీలను ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో ఆర్గనైజర్లు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే దాదాపు నెల రోజులకు పైగా నిర్వహించిన క్రికెట్ టోర్నీ ముగియగా మిగతా పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. రాష్ట్రం నుండే కాకుండా కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణ తదితర రాష్ట్రాల నుంచి వచ్చిన జట్లు క్రీడల్లో పాల్గొంటున్నాయి. గెలుపొందిన జట్లకు భారీగా నగదు బహుమతులు ఉండటంతో క్రీడాకారులు హోరాహోరీగా తలపడుతున్నారు. అదేవిధంగా ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొనేందుకు 32 జట్లు వచ్చాయి. వాలీబాల్ పోటీలకు 30 జట్లు, కబడ్డీ పోటీలకు 40 జట్లు, షటిల్ బ్యాడ్మింటన్‌కు 30 జట్లు వచ్చాయి. ఆయా పోటీలను తిలకించేందుకు అధిక సంఖ్యలో జనం తరలివస్తున్నారు. దీంతో క్రీడామైదానాలు కళకళలాడుతున్నాయి. ఆర్గనైజర్లుగా బీఆర్ బసిరెడ్డి, భీమిరెడ్డి, నజీర్‌అహమ్మద్, పాలశ్రీనివాసరెడ్డి విశ్వనాథ్‌రమేష్, బాబాఖాన్, రామకృష్ణ తదితరులు వ్యవహరిస్తున్నారు. పట్టణ సీఐ మధుసుదన్‌రావు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు చేపట్టారు.